సాక్షి గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

మంగళవారం । 23 । జనవరి । 2024



శోభాయాత్రలో ఎస్ఎంఆర్ స్కూల్ విద్యార్థులు







జై శ్రీరామ్..

లోగిళ్లకు మామిడి తోరణాలు.. ఇష్టదైవాల ఎదుట దీపారాధన.. ఆలయాల్లో ప్రత్యేక పూజలు.. అన్నదానాలు.. శోభాయాత్రలు.. ప్రముఖ ఆలయాల్లో కల్యాణోత్సవాలతో జిల్లా వ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొంది. అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ నేపథ్యంలో సోమవారం జిల్లా వ్యాప్తంగా భక్తి పారవశ్యం ఉప్పొంగింది. ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించి తరించారు. ఇందుకు సంబంధించి ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రామ నామ స్మరణ, సంకీర్తనలు, భజనలతో పరిసరాలు మార్మోగాయి. - సాక్షి, నెట్‌వర్క్

- మరిన్ని చిత్రాలు 11, 12లో▸



హనుమకొండ రెవెన్యూకాలనీ రామాలయంలో సీతారాముల ఉత్సవ విగ్రహాలకు పూజ చేస్తున్న అర్చకులు.. హారతి తీసుకుని స్వామివారికి మొక్కుతున్న భక్తులు

న్యూస్‌రీల్

'కవిత్వంతో కలుద్దాం'



హన్మకొండ కల్చరల్ : తెలంగాణ రచయితల సంఘం ఆధ్వర్యంలో 'కవిత్వంతో కలుద్దాం' కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం రాత్రి అడ్వకేట్స్ కాలనీలో ప్రముఖ దారుశిల్పి మర్రిగోపాల్ నివాసంలో కవి పొట్లపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కవులు పాల్గొని తమ కవితలను వినిపించారు. అనంతరం గోపాల్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి బిల్ల మహేందర్, కవయిత్రి రమాదేవి, కవులు మాధవి, అరవింద, అంజనీదేవి, కమల, రత్నమాల, రామనరసింహస్వామి, శ్రీధర్‌స్వామి, సురేందర్, కుమారస్వామి, లీల పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

న్యూశాయంపేట : మైనారిటీ గురుకులాల్లో 2024–25 విద్యాసంవత్సరానికి ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వరంగల్ జిల్లా పరిధిలోని వరంగల్(బీ)1, వరంగల్(జీ)2 ప్రిన్సిపాళ్లు భిక్షపతి, నీలిమాదేవి తెలిపారు. వరంగల్ శంభునిపేట బాలికల మైనారిటీ గురుకులంలో ఇందుకు సంబంధించిన బ్రోచర్లను సోమవారం వారు ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రిన్సిపాళ్లు మాట్లాడారు. ఐదో తరగతిలో ప్రవేశాల కోసం మైనారిటీలకు ఫస్ట్ కమ్ ఫస్ట్ బేసిస్, నాన్ మైనారిటీల కోసం లక్కీడిప్ ద్వారా సీట్లు ఇస్తామని తెలిపారు. 6,7, 8 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను (మైనారిటీలకు మాత్రమే) ఫస్ట్ కమ్ ఫస్ట్ బేసిస్ ద్వారా భర్తీ చేస్తామని చెప్పారు. పదో తరగతిలో వచ్చిన జీపీఏ ఆధారంగా ఇంటర్ సీట్లను భర్తీచేస్తామని వివరించారు. ఇందులో 75 శాతం మైనారిటీలకు, 25 శాతం సీట్లు నాన్ మైనారిటీలకు కేటాయించనున్నట్లు వెల్లడించారు. tmreis. telangana.gov.inలో వచ్చేనెల 6 వరకు దరఖాస్తులు సమర్పించవచ్చన్నారు. వివరాలకు జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి కార్యాలయం, 9948094428, 9398745178 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కేడీసీలో గెస్ట్ లెక్చరర్ల నియామకానికి ఇంటర్వ్యూ

విద్యారణ్యపురి : హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ల (రెండు సబ్జెక్టులు) నియామకానికి కళాశాల విద్యాశాఖ కమిషనర్ అనుమతి ఇచ్చినట్లు కేడీసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రాజారెడ్డి సోమవారం తెలిపారు. కంప్యూటర్ సైన్స్ అప్లికేషన్స్, మైక్రోబయాలజీ బోధించేందుకు గెస్ట్ లెక్చరర్ నియామకానికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈపోస్టుల నియామకానికి యూజీసీ నిబంధనల ప్రకారం ఆయా పీజీకోర్సుల్లో 55శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. నెట్, సెట్, స్లెట్, పీహెచ్‌డీ అర్హత కలిగి ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 23న ఉదయం 11గంటలకు తమ విద్యార్హతల ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్‌సెట్‌తో కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు.

శిక్షణతో విశ్వాసం పెంపొందుతుంది

కేయూ క్యాంపస్ : శిక్షణతో విద్యార్థుల్లో విశ్వాసం పెంపొందుతుందని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య టి.శ్రీనివాసరావు అన్నారు. విశ్వవిద్యాలయ సెంటర్ ఫర్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ ట్రెయినింగ్ సంచాలకులు డాక్టర్ ఆర్.మేఘనారావు ఆధ్వర్యంలో ఇంగ్లిష్ విభాగంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వినడం ఒక కళ అని, ఉద్యోగార్థుల జీవితంలో ఈ నైపుణ్యంలో పట్టు సాధించాలని, ప్రతి విద్యార్థి తన దశలో ఒక కొత్త లాంగ్వేజ్ నేర్చుకోవాలని, భాషలో మెళకువలు అవసరం అన్నారు. మంచి కమ్యూనికేషన్‌తో ప్రతి రంగంలో విజయం సాధ్యమవుతుందని సూచించారు. ఆచార్య పి.మల్లారెడ్డి, ఆర్.మల్లికార్జునరెడ్డి, దీపాజ్యోతి, పి.నిర్మల, సహాయ రిజిస్ట్రార్ కోలా శంకర్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమం

అధికారులు సక్రమంగా విధులు నిర్వర్తించాలి

- పనితీరు సరిగాలేకుంటే కఠిన చర్యలు తప్పవు
- ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు
- రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- వరంగల్ కలెక్టరేట్ 'ప్రజావాణి'లో ఫిర్యాదులు స్వీకరించిన మంత్రి



ప్రజావాణిలో దరఖాస్తు దారులతో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

కరీమాబాద్: 'అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం.. అధికారులు కూడా ప్రజాసమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వీడాలి.. విధులు సక్రమంగా నిర్వర్తిస్తూ ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలి.. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవు.. 'ప్రజావాణి'కి ఒకసారి వచ్చిన దరఖాస్తు మరోసారి రాకుండా సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలి' అని రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. వరంగల్ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమానికి హాజరైన మంత్రి ప్రజల నుంచి స్వయంగా వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాపాలన దరఖాస్తులపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, ఇప్పటికే అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించామని, అర్హులకు పథకాలు అమలయ్యేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. హైదరాబాద్ ప్రజాభవన్‌కు వరంగల్ జిల్లా నుంచి రెండు విడతల్లో వచ్చిన 266 దరఖాస్తులను పరిష్కరించేందుకు నోడల్ అధికారి నేతృత్వంలో చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. ఆరు గ్యారంటీల ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణలో అధికారులు చిత్తశుద్ధితో పనిచేశారని, అదే స్ఫూర్తితో క్షేత్రస్థాయిలో అర్హుల ఎంపికకు నిష్పక్షపాతంగా సర్వే చేయాలని సూచించారు. 'ప్రజావాణి'లో వచ్చిన దరఖాస్తులు, ఫిర్యాదులపై అధికారులు స్పందించాలని, రెవెన్యూ, భూ సమస్యలకు సంబంధించి న్యాయబద్ధంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రోడ్లు, డ్రెయినేజీలు పరిశుభ్రంగా కనిపిస్తున్నాయనీ.. ఇదే పద్ధతి కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ అశ్వినితానాజీ వాకాడె, మున్సిపల్ కమిషనర్ రిజ్వాన్‌బాషాలతోపాటు వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. కాగా ప్రజావాణిలో మొత్తం 55 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. అంతకు ముందు మంత్రి సురేఖకు వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ అశ్వినితానాజీ వాకాడెలు పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు.

వినతులు సత్వరమే పరిష్కరించాలి

హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్

హన్మకొండ అర్బన్ : ప్రజావాణిలో వివిధ సమస్యలపై ప్రజల నుంచి స్వీకరించిన వినతులను ఆయా శాఖల అధికారులు సత్వరమే పరిష్కరించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఇందులో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ పరిధిలో 6, జిల్లా ఇరిగేషన్ అధికారికి 3, ఎంపీడీఓ, దామెర 2, వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 45 దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వినతులను త్వరితగతిన పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి వెంటనే పరిష్కారం అయ్యేలా చూడాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, డీఆర్‌డీఓ శ్రీనివాస్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

కుటుంబ వ్యవస్థలో మార్పు రావాలి

- లింగ వివక్షను రూపుమాపాలి
- హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, తదితరులు

హన్మకొండ అర్బన్ : ఆడపిల్లల విషయంలో వివక్షను రూపుమాపాలంటే ముందుగా కుటుంబ వ్యవస్థలో మార్పు రావాలని హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం కలెక్టరేట్‌లో 'మిషన్ శక్తి' జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఆడ పిల్లలు వివక్షకు గురవుతున్నారని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఈ పరిస్థితి అధికంగా ఉందన్నారు. గర్భంలో ఉన్నప్పుడే ఆడపిల్ల అని తెలియగానే గర్భ విచ్ఛిత్తికి పాల్పడుతున్నారని, ఈ అసాంఘిక చర్యలకు అడ్డుకట్ట వేసేందుకు 1994 గర్భస్థ లింగ నిర్ధారణ చట్టం–2003 వచ్చిందని చెప్పారు. ఈ చట్టానికి విరుద్ధంగా వ్యవహరించే కేంద్రాలపై నిఘా పెంచి బాధ్యులపై చర్య తీసుకోవాలని వైద్యారోగ్య, పోలీస్ శాఖ అధికారులను ఆదేశించారు. ఆడ పిల్లను వద్దనుకుంటే ప్రభుత్వానికి అప్పగిస్తే వారి బాధ్యత చూసుకుంటుదని తెలిపారు. ఆడ పిల్లలకు రక్షణ, సంరక్షణకు విద్యాహక్కు చట్టం, బాల్య వివాహ నిరోధక చట్టం, లైంగిక నేరాల నుంచి రక్షించే చట్టం, బాలకార్మిక నిర్మూలన చట్టం అండగా ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లాలో ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో బాలబాలికలకు ఏ చిన్న సమస్య రాకుండా గ్రామ, మండల, పట్టణ స్థాయి కమిటీలను బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా బాలికా సంరక్షణ, విద్యా సాధికారత కోసం ఏర్పాటు చేసిన బ్యానర్‌పై తొలి సంతకం చేసిన కలెక్టర్ అనంతరం వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. సంక్షేమాధికారి మధురిమ, అదనపు కలెక్టర్ రాధికగుప్తా, డీఆర్‌డీఓ శ్రీనివాస్‌కుమార్, డీఎంహెచ్ఓ సాంబశివరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాధవీలత, పౌరసరఫరాల శాఖ అధికారి వసంతలక్ష్మి, బాలల పరిరక్షణ అధికారి పి.సంతోష్‌కుమార్, మిషన్ కోఆర్డినేటర్ కల్యాణి, సూపరింటెండెంట్ లక్ష్మీకాంత్‌రెడ్డి, ప్రొటెక్షన్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్, పోషణ్ అభియాన్ కోఆర్డినేటర్ సుమలత, సఖి అడ్మిన్ హైమావతి పాల్గొన్నారు.

బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు కాంగ్రెస్ భయపడదు



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

హన్మకొండ చౌరస్తా: బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లకు కాంగ్రెస్ భయపడదని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ అసోంలో చేపట్టిన 'భారత్ జోడో' న్యాయ యాత్రపై బీజేపీ దాడి చేయడాన్ని నిరసిస్తూ ఏఐసీసీ పిలుపుమేరకు సోమవారం హనుమకొండలోని డీసీసీ భవన్ నుంచి పబ్లిక్‌గార్డెన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఓడిపోతామనే భయం బీజేపీ, మోదీకి పట్టుకుందన్నారు. ప్రజాస్వామిక సంఘాలు, విద్యార్థి, యువజన, మహిళా సంఘాలు ఈ దాడులను ఖండించాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీ వరంగల్ అధ్యక్షురాలు స్వర్ణ, టీపీసీసీ ఉపాధ్యక్షుడు సాంబయ్య, కార్పొరేటర్లు వెంకటేశ్వర్లు, రవీందర్, శ్రీమన్నారాయణ, విజయశ్రీ, శ్రీనివాస్, నాయకులు కిషన్, ఆనంద్, శ్రీనివాసరావు, సరళ, డాక్టర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమాధానాలతో సరిపెడితే ఎలా?

- అధికారుల తీరుపై ప్రజల రుసరుస
- అనుమతి లేని, అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు
- గ్రేటర్ వరంగల్ గ్రీవెన్స్‌కు 57 వినతులు
- స్వీకరించిన బల్దియా అధికారులు



దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

వరంగల్ అర్బన్: 'ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు.. పరిష్కరిస్తామని సమాధానం చెబుతున్నారు.. అయితే క్షేత్ర స్థాయిలో పనులు, సమస్యలను పట్టించుకోకుండా సమాధానాలతో సరిపెడితే ఎలా?' అంటూ పలు కాలనీల ప్రజలు అధికారులను నిలదీశారు. బల్దియా కౌన్సిల్ హాల్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 57 వినతులు వచ్చాయి. అందులో ఇంజనీరింగ్ సెక్షన్ 10, హెల్త్–శానిటేషన్ 7, ప్రాపర్టీ టాక్స్(రెవెన్యూ)8, టౌన్ ప్లానింగ్ 31, ఉద్యాన వన విభాగం 1 ఉన్నాయి. అత్యధికంగా అక్రమ నిర్మాణాలు, అనుమతి లేని భవనాలపై వచ్చాయి. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు అనిసుర్ రషీద్, రవీందర్‌యాదవ్, ఎస్ఈలు కృష్ణారావు, ప్రవీణ్‌చంద్ర, సిటీ ప్లానర్ వెంకన్న, బయాలజిస్ట్ మాధవరెడ్డి, డీఎఫ్ఓ శంకర్ లింగం, హెచ్ఓ రమేష్, డిప్యూటీ కమిషనర్ రవీందర్, టీపీఆర్ఓ రాజేష్ కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

- 55వ డివిజన్ భీమారం శ్యామల చెరువు(సర్వే నంబర్ 642)కు సంబంధించి 67.22 ఎకరాలు ఉండగా 30ఎకరాల భూమి ఆక్రమణకు గురైంది. అందులో నిర్మాణాలు చేపడుతున్నారని ఎన్ని మార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని సిటీ ప్లానర్‌ను కాలనీవాసులు నిలదీశారు.
- 17వ డివిజన్ స్తంభంపల్లి ఆదర్శనగర్‌లో 66–3–102, 66–3–130 నంబరు కలిగిన ఇళ్లకు ఏడాది కాలంగా నల్లా నీరు రావడం లేదు. ఏఈకి వంద సార్లు ఫోన్ చేసినా పట్టించుకోవడం లేదని సురేందర్, మరో వ్యక్తి వేర్వేరుగా ఫిర్యాదు చేశారు.
- రంగంపేటలోని తమ ఇంటి నల్లా బైఫరికేషన్‌లో మార్చారని, తమకు న్యాయం చేయాలని రాధిక ఫిర్యాదు చేశారు.
- వరంగల్‌లోని మక్కా మసీదు వద్ద డ్రెయినేజీ సరిగ్గా లేక అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని మసీదు కమిటీ ప్రతినిధులు వినతి పత్రం ఇచ్చారు.
- నగరంలోని దర్గాలు, గ్రేవి యార్డుల్లో చెట్ల కట్టింగ్, పారిశుద్ధ్య పనులు చేపట్టి లైటింగ్ ఏర్పాటు చేయాలని ఈద్గా ఫోర్ట్ ప్రతినిధులు వినతి పత్రాన్ని అందజేశారు.
- 1వ డివిజన్ భీమారం ఎర్రగట్టుగుట్ట శ్రీనివాస కాలనీలో 2 కల్వర్టులు నిర్మించాలని పలుమార్లు వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకోవడం లేదని అభివృద్ధి కమిటీ ప్రతినిధులు దరఖాస్తు ఇచ్చారు.
- హనుమకొండ రెవెన్యూ కాలనీలో మిగిలి ఉన్న 1.5 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సాయిలు, దేవేందర్‌రావు వినతిపత్రం ఇచ్చారు.
- భీమారం విద్యారణ్యపురి 2–12–14/1 ఇంటి నంబర్‌కు నల్లా లేకున్నా మూడేళ్ల నుంచి బిల్లు వస్తుందని, మినహాయించాలని శివనాగయ్య దరఖాస్తు పెట్టుకున్నారు.
- నగరంలో కుక్కలు, కోతుల బెడద విపరీతంగా ఉంది. బయటకు రావాలంటే ప్రజలు హడలిపోతున్నారు. వారిని రక్షించాలని డి.తిరుపతి వినతి పత్రం సమర్పించారు.
- 64వ డివిజన్ హిల్స్‌కాలనీ టీఎన్‌జీవోస్ కాలనీ చుట్టూ డ్రెయినేజీ లేక మురుగునీరు రోడ్డుపై పారుతోందని, కాల్వ నిర్మించాలని కాలనీ వాసులు వినతిపత్రం ఇచ్చారు.
- 4వ డివిజన్ యాదవనగర్ పెట్రోల్ పంపు వెనుక డ్రెయినేజీ లేక ఖాళీ స్థలాలు, ఇళ్ల మధ్యలోకి మురుగునీరు వస్తున్నదని, సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని కాలనీల వాసులు దరఖాస్తు ఇచ్చారు.
- గొర్రెకుంట 45–3–90 నంబర్ కలిగిన చిన్న రేకుల ఇంటికి సంబంధించి పన్ను ప్రతీ ఏడాది చెల్లిస్తున్నా ఇంకా రూ.4,791 బకాయితోపాటు వడ్డీ రూ.19,086 చెల్లించాలంటున్నారు.. వాస్తవాలను గుర్తించాలని బి.రమేష్ వినతి పత్రాన్ని అందచేశారు.

వరంగల్ రిజిస్ట్రేషన్లు.. హనుమకొండలోనే

- రెండేళ్లు దాటినా మారని పరిధులు
- ప్రజలకు తప్పని ఇబ్బందులు
- ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు పక్క జిల్లాకు వెళ్లాల్సిన పరిస్థితి
- మంత్రి కొండా సురేఖ దృష్టి సారించాలంటున్న నగరవాసులు



సాక్షి, వరంగల్: జిల్లాల పునర్విభజనలో భాగంగా వరంగల్ రూరల్ వరంగల్‌గా, వరంగల్ అర్బన్ హనుమకొండ జిల్లాగా ఏర్పడి రెండేళ్లు దాటినా కొన్ని ప్రభుత్వ విభాగాల పరిధి ఇంకా మారకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. వరంగల్ నగరంలోని వరంగల్, కొత్తవాడ, దేశాయిపేట, పోచమ్మమైదాన్, కాశిబుగ్గ, ఏనుమాముల ప్రాంతాల్లోని ఇళ్లు, ఓపెన్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లు ఇంకా హనుమకొండలోని రిజిస్ట్రేషన్ కార్యాలయంలోనే జరుగుతున్నాయి. దీంతో ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. ఎందుకంటే పోచమ్మమైదాన్‌లో వరంగల్ రూరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసు ఉన్నా ఆ కార్యాలయం చుట్టు పక్కల ప్రాంతాల్లోని భూములు, ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు హనుమకొండ జిల్లాకు వెళ్లాల్సిందే. కొత్తగా పెళ్లైనవారికి మ్యారేజ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ల కోసమూ అక్కడికే వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. సర్టిఫైడ్, ఈసీ కాపీల కోసం ఇబ్బందులు తప్పడం లేదు. జిల్లాల విభజన ప్రభుత్వ విభాగాలకు వర్తించదా అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గతంలో వరంగల్ అర్బన్ జిల్లాలో హనుమకొండ సిటీతో పాటు వరంగల్ సిటీ ఉంది. అయితే వరంగల్ రూరల్ జిల్లాను మార్చే క్రమంలో వరంగల్ నగరం కేంద్రంగా వరంగల్ జిల్లా ఏర్పడింది. అయినా ఇప్పటికీ వరంగల్ మండల పరిధిలోని రిజిస్ట్రేషన్లు ఇంకా హనుమకొండ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో జరుగుతుండడం గమనార్హం.

రిజిస్ట్రేషన్ కార్యాలయాల పరిధిలో..

పోచమ్మమైదాన్‌లోని వరంగల్(రూరల్) రిజిస్ట్రేషన్ కార్యాలయం పరిధిలో ఇంతకు ముందు సంగెం, గీసుగొండ, హసన్‌పర్తి, ఆత్మకూరు, హన్మకొండ మండలాలు ఉండేవి. ఈ మండలాలకు సంబంధించి సుమారు 50కి పైగా గ్రామాల రిజిస్ట్రేషన్లు జరిగేవి. ప్రస్తుతం వరంగల్(రూరల్) కార్యాలయం పరిధిలో సంగెం మండలం కొంత భాగం, గీసుగొండ మండలం కొంత భాగం మాత్రమే ఉన్నాయి. అయితే.. వరంగల్ మండల పరిధిలో పైడిపెల్లి, ఆరెపల్లి, కొత్తపేట, మట్టెవాడ శివారు, ఏనుమాముల, లక్ష్మీపురం, దేశాయిపేట శివారు ప్రాంతాల రిజిస్ట్రేషన్లు ఇక్కడనే జరిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే ఖిలావరంగల్ రిజిస్ట్రేషన్ కార్యాలయం పరిధిలో ఐనవోలు, ఖిలావరంగల్, మట్టెవాడ శివారు, నగరానికి సంబంధించిన రిజిస్ట్రేషన్లు అధికంగా జరిగేవి. ప్రస్తుతం ఐనవోలు, ఖిలావరంగల్ మండలాలు మాత్రమే ఉన్నాయి. వరంగల్ మండల పరిధిలోని దాదాపు అన్ని ప్రాంతాల్లోని భూముల రిజిస్ట్రేషన్లు హనుమకొండలో జరుగుతుండడంతో ఇక్కడి కార్యాలయం వెలవెలబోతోంది. గతంలో రాత్రి 8 గంటల వరకు జనాలతో కళకళలాడే ఈ రిజిస్ట్రేషన్ కార్యాలయం ప్రస్తుతం డాక్యుమెంట్లు లేక సాయంత్రం 5 గంటల లోపే తాళాలు పడుతున్నాయి. గతంలో ఈ అంశాలు చర్చకు వచ్చినా నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఈ అంశాలను ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి పరిష్కరించే దిశగా ముందుకు వెళ్తానని వరంగల్ కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి హాజరైన మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు.


వరంగల్‌లోనే రిజిస్ట్రేషన్లు జరిగేలా చూడాలి..



వరంగల్ మండలంతో పాటు కేటాయించిన మండలాల పరిధి అన్ని గ్రామాల రిజిస్ట్రేషన్లు వరంగల్ కార్యాలయంలో జరిగేలా ఆదేశాలు జారీ చేయాలి. కొన్ని హనుమకొండలో ఉండడం వల్ల ఇబ్బందులు తప్పడంలేదు. ఈ విషయం మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకుపోయాం. త్వరగా సమస్య పరిష్కరించాల్సిన అవసరం ఉంది.

- ఎస్.గోపాల్, డాక్యుమెంట్ రైటర్స్ అసోసియేషన్ వరంగల్ -జిల్లా అధ్యక్షుడు

రవాణా భారం తగ్గే అవకాశం..



ప్లాట్ల క్రయ, విక్రయాల సమయంలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. వరంగల్ మండల పరిధిలోని ఓపెన్ ప్లాట్లు, ఇతర ఆస్తుల రిజిస్ట్రేషన్ కోసం హనుమకొండకు వెళ్లాలంటే తిప్పలు తప్పడం లేదు. ఇటీవల నాతో పాటు మా బంధువు ప్లాటు రిజిస్ట్రేషన్ సమయంలో హనుమకొండకు వెళ్లి చాలా సమయం వెచ్చించాల్సి వచ్చింది. అదే వరంగల్ లో ఉంటే సమయంతోపాటు రవాణా కూడా తగ్గుతుంది.

- సిల్వేరు శ్రీనివాస్, వరంగల్

రెండు రోజుల్లో వివరణ ఇవ్వాలి

హన్మకొండ అర్బన్ : మడికొండ శివారులో ఏర్పాటు చేసిన టెక్స్‌టైల్ పార్క్‌లో జరిగిన అవకతవకలపై రెండు రోజుల్లో సంపూర్ణ నివేదిక తయారు చేసి వివరణ ఇవ్వాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ చేనేత, జౌళి శాఖ ఏడీని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో టెక్స్‌టైల్ పార్క్‌కు చెందిన లబ్ధిదారులు తమకు జరిగిన మోసంలో బ్యాంక్ అధికారులు, బిల్డర్లు, పాలకవర్గం, పవర్‌లూమ్స్ కంపెనీ యజమాని భాగస్వాములయ్యారని కలెక్టర్‌కు వివరించారు. దీనిపై సీబీఐతో విచారణ చేయించాలని వినతిపత్రం ఇవ్వగా.. స్పందించిన కలెక్టర్.. రెండు రోజుల్లో వివరణ ఇవ్వాలని జిల్లా జౌళి శాఖ ఏడీని ఆదేశించారు.



జరిగిన మోసం గురించి కలెక్టర్‌కు వివరిస్తున్న లబ్ధిదారులు

క్లుప్తంగా

ధాన్యం కేంద్రాల వద్ద దొంగతనం

- నిల్వ ఉన్న వడ్లను అపహరిస్తున్న దుండగులు
- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

హసన్‌పర్తి: దొంగలు కొత్త పంథాను ఎంచుకున్నారు. ఇప్పటి వరకు తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడే వారు. అయితే ఇప్పుడు మాత్రం రూట్ మార్చారు. కల్లాల వద్ద నిల్వ ఉన్న ధాన్యాన్ని ఎత్తుకెళ్తున్నారు. తన కల్లాల వద్ద నుంచి బస్తాల్లో నింపిన ధాన్యం బస్తాలను ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపాడు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గోపీ తెలిపారు. మండలంలోని వంగపహాడ్‌కు చెందిన తెట్టె నాగార్జున్ వరి ధాన్యం పండించాడు. ఆ ధాన్యాన్ని హైవే సమీపంలోని ఓ వెంచర్‌లో ఆరబోశాడు. శనివారం బస్తాల్లో ధాన్యాన్ని నింపాడు. 45 బస్తాల ధాన్యం అమ్మకానికి సిద్ధమయ్యాడు. అయితే ట్రాక్టర్ అందుబాటులో లేకపోవడంతో అక్కడే పెట్టాడు. ఆదివారం సాయంత్రం వచ్చి చూసేసరికి ధాన్యం బస్తాలు మాయమయ్యాయి. రూ.80 వేల విలువైన ధాన్యం ఎత్తుకెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఇదిలా ఉండగా, పదిహేను రోజుల క్రితం ముచ్చర్లలోని నుంచి రెండు ట్రాక్టర్ల ధాన్యం మాయమయ్యాయి. అయితే మరుసటిరోజే బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ద్విచక్ర వాహనాలు ఢీ.. ముగ్గురికి గాయాలు


జఫర్‌గఢ్: రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలైన ఘటన సోమవారం మండలంలోని రేగడి తండా శివారు కేజీ తండా వద్ద చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని దుర్గ్యానాయక్ తండాకు చెందిన బానోత్ రాములు పని నిమిత్తం జఫర్‌గఢ్‌కు వచ్చి తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. మండలంలోని హిమ్మత్‌నగర్‌కు చెందిన మందపురి చంద్రమౌళి, అతని భార్య అనూషతో కలిసి బైక్‌పై స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి జఫర్‌గఢ్ వస్తున్నారు. ఈ క్రమంలో కేజీ తండా వద్ద ఎదురెదురుగా రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో బైక్‌లపై ఉన్న ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. రాములు పరిస్థితి విషయంగా ఉన్నట్లు తెలిసింది. రాములు అతివేగంగా నిర్లక్ష్యంగా వాహనం నడిపి ఢీకొట్టడం తోనే ప్రమాదం జరిగిందని చంద్రమౌళి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఖిలావరంగల్‌లో..

ఖిలా వరంగల్: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరికి గాయాలైన ఘటన సోమవారం రాత్రి వరంగల్ ఫోర్టురోడ్డు పై ఏఎస్ఎం కళాశాల సమీపంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. వరంగల్ ఫోర్ట్‌రోడ్డుపై రెండు బైక్‌లు అతివేగంగా ఢీకొనడంతో ఇద్దరు వాహనచోదకులు గాయపడ్డారు. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను 108 వాహనంలో ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది. విషయం తెలిసిన మిల్స్‌కాలనీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించినట్లు సమాచారం.



గీసుకొండ లక్ష్మీనర్సింహస్వామి మూల విరాట్, గీసుకొండ గుట్టపై ఆలయం



బ్రహ్మోత్సవాలకు వేళాయె..

నేటి నుంచి గీసుకొండ జాతర

- సాయంత్రం 5 గంటలకు గుట్టపైకి చేరనున్న లక్ష్మీనర్సింహస్వామి వారు
- 27వ తేదీన ముగింపు

గీసుకొండ : గీసుకొండ మండల కేంద్ర శివారులో నల్లరాతి గుట్టపై స్వయంభూగా వెలిసిన శ్రీ లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు(జాతర) ఈ నెల 23 నుంచి 27 వరకు వైభవంగా సాగనున్నాయి. మంగళవారం సాయంత్రం 5 గంటలకు స్వామివారిని గీసుకొండలోని వేణుగోపాలస్వామి ఆలయం నుంచి స్వామివారిని గుట్టపై ఆలయంలోకి తోడ్కొని వెళ్తారు. అనంతరం రాత్రి 8 గంటలకు అంకురార్పణ, ధ్వజారోహణ, కల్యాణోత్సవం జరుపుతామని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త అర్చకులు వేదాంతం వెంకటనర్సింహార్యులు, వేదాంతం మురళీకృష్ణమాచార్యులు తెలిపారు. 24న హోమబలిహరణం, తీర్థప్రసాద వినియోగం, 25న పూర్ణాహుతి, జాతర బండ్లు తిరుగుట, స్వామివారికి మొక్కుబడులు సమర్పించడం ఉంటాయని, 26న ఉదయం స్వామివారి సేవలు, కేశఖండనం, పుష్పయాగం ఉంటాయని, 27న చివరి రోజు సాయంత్రం స్వామి వారిని గీసుకొండలోని వేణుగోపాలస్వామి ఆలయానికి తోడ్కొని వెళ్లడంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు.

చారిత్రక ఆనవాళ్లకు సాక్ష్యం..

సుమారు 400 అడుగుల ఎత్తులో ఉన్న గుట్టచుట్టూ 70 ఎకరాల ప్రాంతంలో మధ్యశిలా యుగం మొదలు.. శాతవాహనుల కాలానికి సంబంధించిన ఎన్నో చారిత్రక ఆధారాలు బయలపడ్డాయి. 2001లో తొలిసారి గీసుకొండకు చెందిన పురావస్తు పరిశోధకుడు ముత్తినేని రాధాకృష్ణ ఈ విషయాన్ని వెలుగులోకి తీసుకొచ్చారు. మధ్యరాతియుగానికి సంబంధించిన సూక్ష్మరాతి పనిముట్లు, నవీన శిలాయుగానికి సంబంధించిన గొడ్డళ్లు, నూరే రాళ్ళు, మట్టి పెంకులు, బృహత్‌శిలాయుగపు సమాధులు(మెగాలిథిక్ బరియల్స్) వెలుగు చూశాయి. హైదరాబాద్ నుంచి వచ్చిన పురావస్తుశాఖ అధికారులు పరిశీలన కోసం నాలుగు ట్రెంచ్‌లను తవ్వడంతో మరిన్ని ఆధారాలు వెలుగులోకి వచ్చాయి. మొదటి ట్రెంచ్‌లో బౌద్ధ మతానికి సంబంధించిన స్తూపం బయటపడింది. దీనికి సంబంధించిన ఇటుకలు కూడా వెలుగుచూశాయి. అందులోనే బోధిసత్వుడి తెల్లని ప్రతిమ బయటపడటంతో జిల్లాలోనే మొదటి బుద్దిస్టు సైట్‌గా దీనిని గుర్తించారు. దీంతో అప్పట్లో ఈ ప్రాంతం బౌద్ధ ఆరామాలకు నిలయంగా మారి ఉంటుందని పురావస్తు శాఖ నిపుణులు అభిప్రాయపడ్డారు. శాతవాహనుల సంబంధించిన నాణెం కూడా లభించింది. ఈ విషయం గతంలో పార్లమెంట్‌లో చర్చకు వచ్చింది. అప్పటి కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి అనంతకుమార్ భారత ఆర్కియాలజికల్ సర్వే అధికారులను గీసుకొండ గుట్ట వద్ద అధ్యయనం చేయాలని ఆదేశించారు. అయితే అధికారులు వచ్చి వెళ్లాక ఎవరూ పట్టించుకోకపోవడంతో విషయం మరుగునపడింది. ఇక్కడ లభ్యమైన చారిత్రక అవశేషాలను, ప్రతిమలు, టెర్రకోట బొమ్మలు, రాతి ఆయుధాలను వరంగల్‌లోని పురావస్తు మ్యూజియంలో భద్రపరిచారు. గుట్ట ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా గుర్తించి మరింత క్షుణ్ణంగా పరిశోధనలు చేస్తే చారిత్రక క్రమం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

లక్ష్మీనర్సింహస్వామి మహత్యం అనేక కథల రూపంలో ప్రచారంలో ఉంది. గతంలో పురావస్తుశాఖ వెలికితీసిన చారిత్రక ఆనవాళ్లు ఇందుకు సాక్ష్యంగా నిలుస్తున్నాయి. స్వామి కొలువైన గీసుకొండ గుట్ట వద్ద రెయిలింగ్, మెట్లు, దిగువన ఆలయ నిర్మాణం, పలు అభివృద్ధి పనులను పలువురు దాతలు చేపట్టారు. భక్తులు ఇబ్బంది కలుగకుండా జాతర విజయవంతానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఏనుగుల సాంబరెడ్డి తెలిపారు. అయితే గుట్టపై ఆలయ అభివృద్ధి, జాతర నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయాలని భక్తులు కోరుతున్నారు.

రమణీయం.. రాములోరి కల్యాణం

- జీడికల్‌లో ఘనంగా సీతారాముల పెండ్లి
- తిలకించి పులకించిన భక్తజనం



సీతారాముల కల్యాణోత్సవంలో తాళిబొట్టును చూపిస్తున్న అర్చకుడు

లింగాలఘణపురం : మండలంలోని జీడికల్ వీరాచల రామచంద్రస్వామి ఆలయంలో సోమవారం సీతారాముల కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. అయోధ్యలో రాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా జీడికల్, నవాబుపేట కోదండ రామస్వామి ఆలయాలను అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. జీడికల్‌లో వేదపండితులు భార్గవాచార్యులు, మురళీకృష్ణమాచార్యులు వేదమంత్రోచ్చారణలతో సీతారాముల కల్యాణం నిర్వహించగా భక్తులు ఆనందోత్సవాల మధ్య తిలకించి తన్మయులయ్యారు. శ్రీరాముడు మాయలేడిని ఇక్కడి లేడిబండ వద్ద సంహరించి సంధ్యావందనం కోసం తన కాలితో నొక్కగా వచ్చిన ఊటనీటి అడుగు నేటికీ జీడికల్‌లో దర్శనమిస్తుంది. అంతటి ప్రాశస్త్యం పొందిన జీడికల్‌లో అయోధ్య రాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా కల్యాణం నిర్వహించడం భక్తులకు ఆనందదాయకమైంది. వందలాది మంది భక్తులు వీరాచల రామున్ని దర్శించుకున్నారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. దేవస్థాన సిబ్బంది రాములు, భరత్, మల్లేశం భక్తులకు సౌకర్యాలు కల్పించారు.

మైనర్లతో గంజాయి దందా

- నలుగురి అరెస్ట్, రిమాండ్
- 2,400 గ్రాముల గంజాయి స్వాధీనం



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

హసన్‌పర్తి : ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు ఇద్దరు మేజర్లతో కలిసి మైనర్లు గంజాయి వ్యాపారం చేస్తూ పోలీసులకు దొరికారు. వివరాలను ఎస్సై అశోక్ విలేకరుల ముందు వెల్లడించారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం పోతరెడ్డిపేటకు చెందిన మహ్మద్ ఖమ్రుద్దీన్, ఎలకపల్లి అరవింద్‌లు కొంతకాలంగా గంజాయి వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. మరో ఇద్దరు మైనర్లను కూడా ఈ వ్యాపారంలో భాగస్వాములు చేసుకున్నారు. జమ్మికుంటకు చెందిన పిట్టల నాగరాజు నుంచి వీరు గంజాయి కొనుగోలు చేసి ఆయా ప్రాంతాల్లో విక్రయాలు చేపడుతున్నారు.

ప్యాకెట్లలో నింపి విక్రయం

కొనుగోలు చేసిన గంజాయిని చిన్నచిన్న ప్యాకెట్లల్లో నింపి వాటిని రూ. 1000కి విక్రయిస్తున్నారు. ముఖ్యంగా కాలేజీ విద్యార్థులే ఈ గంజాయికి బానిసవుతున్నారు. ఇదిలా ఉండగా సోమవారం పిట్టల నాగరాజు నుంచి 2,400 గ్రాముల గంజాయిని రూ.56వేలకు ఖరీదు చేశారు. వాటిని చిన్నిచిన్న ప్యాకెట్లల్లో నింపారు.అయితే హసన్‌పర్తి పెద్ద చెరువు కట్ట సమీపంలోని ఆంజనేయస్వామి దేవాలయం వద్ద నలుగురు వ్యక్తులు పోలీసులను చూసి పరుగులు పెట్టారు. దీంతో అనుమానంతో పోలీసులు వారిని పట్టుకుని విచారించగా వాస్తవాలు అంగీకరించినట్లు ఎస్సై తెలిపారు.నిందితుల నుంచి 2,400 గ్రాముల నంబర్‌ప్లేట్ లేని బైక్, మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వీరిని కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

నందనం సొసైటీ డైరెక్టర్ ఆత్మహత్య



శ్రీనివాస్ (ఫైల్)



కిషన్‌రావు(ఫైల్)

ఐనవోలు : నందనం కర్షక సేవా సంఘం డైరెక్టర్, మల్లికార్జునస్వామి ఆలయ మాజీ చైర్మన్ వడిచర్ల శ్రీనివాస్(55) మండల కేంద్రంలో సోమవారం ఉరివేసుకుని మృతి చెందాడు. ఎస్సై గైకాడి అనిల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని ఆయన నివాసంలో ఉదయం 10 గంటల ప్రాంతంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత భార్య చూసి చుట్టుపక్కల వారితో కలిసి ఉరి నుంచి తప్పించారు. వెంటనే వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా మృతిచెందాడు. శ్రీనివాస్ గత పదేళ్లుగా బీపీ, షుగర్ వ్యాధులతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం వ్యాధులు తగ్గడం లేదని తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లో ఉరివేసుకుని మృతి చెందినట్లు మృతుడి భార్య అనురాధ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడి కుమారుడు కమలాకర్ లండన్‌లో ఉండగా, కూతురు శివాని ఉన్నారు. విషయం తెలుసుకున్న డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు-ఎంపీపీ మధుమతి దంపతులు హుటాహుటిన ఎంజీఎం ఆస్పత్రి పోస్టుమార్టం వద్దకు చేరుకుని బోరున విలపించారు. బాధిత కుటుంబానికి అన్ని రకాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యే పరామర్శ

ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు శ్రీనివాస్ మృతదేహాన్ని సందర్శించి అతని కుటుంబాన్ని పరామర్శించారు. పరామర్శించిన వారిలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ నమిండ్ల శ్రీనివాస్, మార్నేని వెంకటేశ్వర్‌రావు, మహేందర్, సునీల్, రహీంపాషా ఉన్నారు. అలాగే బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోలెపల్లి శంకర్‌రెడ్డి, సంపత్‌కుమార్, జన్ను కుమారస్వామి, సతీష్‌కుమార్ మృతుని కుటుంబాన్ని పరామర్శించారు.

అనారోగ్య సమస్యలతో మరొకరు..

టేకుమట్ల: అనారోగ్య సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని రామకిష్టాపూర్ (వి)లో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రామకిష్టాపూర్(వి)కు చెందిన అడగాని కిషన్‌రావు(65) రెండేళ్ల క్రితం పక్షవాతంతో బాధపడుతుండేవాడన్నారు. పక్షవాతానికి చికిత్స తీసుకుంటున్నా కోలుకోకపోవడంతో పాటు, మరింత ఆరోగ్యం క్షీణించడంతో జీవితంపై విరక్తి చెంది ఆదివారం ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం చిట్యాల సివిల్ ఆస్పత్రికి తరలించి, మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు సాంబశివుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గట్ల సుధాకర్ తెలిపారు.

అనుమతిలేని మెడికల్ షాపుపై దాడులు

- పీఎంపీపై కేసు నమోదు

ఖిలా వరంగల్: పడమరకోటలో ఓ పీఎంపీ అనుమతిలేకుండా నిర్వహించే మెడికల్ షాపుపై సోమవారం సాయంత్రం డ్రగ్స్ అధికారులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. అనుమతులేని మందులు విక్రయిస్తున్నట్లు గుర్తించి పీఎంపీ వైద్యుడు రాజేందర్‌పై కేసు నమోదు చేసి షాపు నుంచి సుమారు రూ.50వేల విలువైన 40 రకాల మందులను స్వాధీనం చేసుకున్నట్లు డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్లు ఎం.అరవింద్‌కుమార్, జె.కిరణ్‌కుమార్ తెలిపారు. వరంగల్ డ్రగ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ జి.రాజ్యలక్ష్మి ఆదేశాల మేరకు సోమవారం రాత్రి ఖిలావరంగల్ పడమరకోటలో పీఎంపీ వై. రాజేందర్ అనుమతిలేకుండా నిర్వహిస్తున్న మెడికల్ షాపుపై అధికారులు ఆకస్మికంగా దాడులు చేపట్టారు. పీఎంపీ వైద్యుడిపై డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం 1940 ప్రకారం క్రిమినల్ కేసు నమోదు చేసి మందులను స్వాధీన పర్చుకున్నట్లు డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న సొత్తును మంగళవారం కోర్టులో జమ చేయబడుతుందని వారు పేర్కొన్నారు. లైసెన్స్ లేకుండా డ్రగ్స్ విక్రయించే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. దాడుల్లో డ్రగ్స్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

అంతరాయం లేని విద్యుత్ అందించాలి



మాట్లాడుతున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

జనగామ: వినియోగదారులకు అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్ అందించాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ లైన్లలో సాంకేతిక లోపం లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. డీటీఆర్‌లపై ఓవర్‌లోడ్ తగ్గించేలా అవసరమైన చోట అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి మూడు నెలలకోసారి 33, 11 కేవీ లైన్ మరమ్మతులు చేయాలన్నారు. విద్యుత్ లైన్‌లో యాక్సిడెంట్లు కాకుండా చూస్తూ సంస్థ అభివృద్ధికి అంకిత భావంతో పని చేయాలన్నారు. ఆపరేషన్ డైరెక్టర్ మోహన్‌రెడ్డి, కమర్షియల్ డైరెక్టర్ సంధ్యారాణి, సీజీఎం ఫైనాన్స్ తిరుపతిరెడ్డి, జిల్లా ఎస్ఈ టి.వేణు మాధవ్, డీఈ, ఏడీఈ, ఏఈ పాల్గొన్నారు.

దాడి చేసిన కేసులో ఏడుగురికి జైలు శిక్ష

- ఒక్కొక్కరికి రూ.1100 జరిమానా

మరిపెడ / మరిపెడ రూరల్: చిన్నగూడూరు మండలం జయ్యారం గ్రామానికి చెందిన ఏడుగురికి తొర్రూరు జూనియర్ సివిల్ జడ్జి మట్ట సరిత ఏడాది జైలుశిక్షతో పాటు జరిమానా విధించినట్లు మరిపెడ ఎస్సై ఎస్‌కె తహెర్‌బాబా తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. 2015లో జయ్యారం జెడ్పీ పాఠశాలలో మధ్యాహ్నం భోజనం వంట చేసే విషయంలో మహిళా గ్రూపుల మధ్య తీవ్ర ఘర్షణ చోటుచేసుకుంది. ఓ గ్రూప్ సంఘం సభ్యులు మరో గ్రూప్ సంఘం సభ్యులపై దాడి చేసి గాయపర్చారు. ఈ సంఘటనపై ఓ మహిళా సంఘం సభ్యురాలు మణెమ్మ 2015లో మరిపెడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ కేసుపై అప్పటి ఎస్సై కృష్ణకుమార్ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశాడు. కోర్టులో సాక్ష్యాధారాలను ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ డి.గణేష్ ఆనంద్ కేసు వాదించారు. ఈ కేసు పూర్వాపరాలు పరిశీలించిన తొర్రూరు జూనియర్ సివిల్ జడ్జి సరిత నాన్నం నర్సమ్మ, అప్పనబోయిన పాపమ్మ, అప్పనబోయిన మదనమ్మ, మంకెన సైదమ్మ, దుండిగల భద్రమ్మ, గంగరబోయిన పుల్లమ్మ, అండెం ఉప్పల్‌రెడ్డిలకు ఏడాది జైలు శిక్ష విధించడంతో పాటు ఒక్కొక్కరికి రూ.1100 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ట్రాన్స్‌జెండర్లకు గౌరవం కల్పిస్తాం..



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

ఖిలా వరంగల్/కరీమాబాద్ : ట్రాన్స్‌జెండర్లకు సమాజంలో గుర్తింపు, గౌరవం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. ఈమేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖకు ట్రాన్స్‌జెండర్లు దరఖాస్తు సమర్పించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మెప్మా ఆధ్వర్యంలో ట్రాన్స్‌జెండర్లకు పునరావాసం కల్పిస్తామన్నారు. ప్రజాపాలనలో ట్రాన్స్‌జెండర్లు అందించిన దరఖాస్తులను తిరస్కరించొద్దని అధికారులకు సూచించారు. అదనపు కలెక్టర్ అశ్విని తానాజీవాకడే, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, డీఆర్డీఏ పీడీ సంపత్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

8, 9 తరగతుల విద్యార్థులకు ఈఎల్‌టీఏ పరీక్షలు

కాజీపేట్ సెంటర్ : టీఎస్ ఎస్‌సీఈఆర్‌టీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ సహకారంతో ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ (ఈఎల్‌టీఏ) ఆధ్వర్యంలో 8, 9వ తరగతి విద్యార్థులకు స్పెల్‌వైర్, డ్రామా పోటీ పరీక్షలు సోమవారం నిర్వహించారు. పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా ఉన్న 150 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 8, 9వ తరగతి చదువుతున్న 2500 మంది స్పెల్ వైర్, 200 మంది విద్యార్థులు డ్రామా పోటీ పరీక్షలకు హాజరయ్యారని ఈఎల్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు టి.వెంకటేశ్వర్‌రావు తెలిపారు. ఈ పరీక్షలకు హాజరైన విద్యార్థులు ఈనెల 30న జరిగే మండలస్థాయి పరీక్షల్లో పాల్గొంటారని తెలిపారు. అనంతరం డీఈఓ చాంబర్‌లో పోటీలకు సంబంధించిన పోస్టర్, ఈఎల్‌టీఏ తయారు చేసిన టెస్ట్ రివిజన్ ప్రాక్టీస్‌బుక్ (ఐ-పాస్), ప్రశ్నపత్రాలను డీఈఓ వాసంతి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతు ఇలాంటి పోటీ పరీక్షలకు హాజరుకావడం వల్ల విద్యార్థులకు ఇంగ్లిష్ భాషపై పట్టు పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో అకడమిక్ మానిటరింగ్ అధికారి మాలోత్ సారయ్య, డీసీఈబీ సెక్రటరీ జి.కృష్ణమూర్తి, సుధీర్‌బాబు పాల్గొన్నారు.

‘స్వచ్ఛ’ ఆటో కార్మికుల నిరసన



ప్రధాన కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

వరంగల్ అర్బన్ : తమ సమస్యలు పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నారని, మూడు నెలలుగా వేతనాలు ఇవ్వకపోతే ఎలా బతకాలంటూ గ్రేటర్ వరంగల్ కార్యాలయం ఎదుట సోమవారం స్వచ్ఛ ఆటోలతో కార్మికులు నిరసన తెలిపారు. సంక్రాంతి పర్వదినం వరకు సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి సాంకేతిక కారణాల పేరుతో తప్పించుకుంటున్నారని కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. బల్దియా ఔట్‌సోర్సింగ్ కార్మికులను గుర్తించాలని, ఉద్యోగ భద్రతకు ఐడీ నంబర్లు కేటాయించాలని, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. వావాహనాలకు చెల్లించాల్సిన బ్యాంకు కిస్తీలు క్లియర్ చేయాలని డిమాండ్ చేశారు. నిరసనకు సీపీఎం నాయకుడు సింగారపు బాబు మద్దతు ప్రకటించారు.

గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధచూపాలి

- ‘అమ్మ’ యాప్‌తో ఆరోగ్యం తెలుసుకోవచ్చు
- వరంగల్ డీఎంహెచ్‌ఓ వెంకటరమణ



గీసుకొండ : అమ్మ యాప్ ద్వారా గర్భిణుల ఆరోగ్యాన్ని తెలుసుకోవచ్చని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె. వెంకటరమణ అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఆరోగ్య కార్యకర్తలకు అమ్మ యాప్‌పై సోమవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రమాదకర లక్షణాలు ఉన్న గర్భిణులను చికిత్స కోసం అన్ని సదుపాయాలు ఉన్న ఆస్పత్రులకు పంపించాలన్నారు. వారు ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత ప్రసవించే వరకు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులో జిల్లా ముందుండేలా కృషి చేయాలన్నారు. డాక్టర్లు సంతోషి, ఉదయ్‌సింగ్, జ్యోతి, డిప్యూటీ డెమో అనిల్‌కుమార్, జ్ఞాన సుందరి, విజయ, మేరి, నితిన్ రెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

బాలికలను అన్నిరంగాల్లో ప్రోత్సహించాలి

- వరంగల్ అదనపు కలెక్టర్ అశ్వినితానాజీ వాకడే
- ఉత్సాహంగా అండర్-18 బాలికల జిల్లాస్థాయి క్రీడాపోటీలు



విజేతగా నిలిచిన జట్టుతో జిల్లా అదనపు కలెక్టర్ అశ్విని తానాజీవాకడే, అధికారులు

కాశిబుగ్గ : బాలికలను అన్నిరంగాల్లో ప్రోత్సహిస్తే రాణిస్తారని అదనపు కలెక్టర్ అశ్విని తానాజీవాకడే అన్నారు. బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా జిల్లా సంక్షేమ శాఖ, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో వరంగల్ ఓసిటీ స్టేడియంలో సోమవారం అండర్-18 బాలికలకు జిల్లాస్థాయి క్రీడాపోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె హాజరై మాట్లాడారు. తల్లిదండ్రులు ఆడపిల్లలను భారంగా భావించకుండా ఉన్నత చదువులు చదివించాలన్నారు. ఆడపిల్లలు కూడా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చెప్పిన విధంగా నడుచుకుంటూ చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తూ ఉన్నతస్థాయికి చేరాలని సూచించారు. ఉత్సాహంగా జరిగిన క్రీడా పోటీల్లో జిల్లాలోని 30 పాఠశాలల నుంచి బాలికలు పాల్గొన్నారు. వాలీబాల్‌లో మొదటి స్థానం టీఆర్‌ఈజేఎస్ నెక్కొండ, రెండో స్థానంలో జెడ్పీహెచ్ఎస్ గొర్రెకుంట నిలిచింది. కబడ్డీలో మొదటి స్థానం జీహెచ్ఎస్ కరీమాబాద్, రెండో స్థానం టీఎస్ఎంఎస్ నెక్కొండ నిలిచింది. ఖోఖోలో మొదటి స్థానం జెడ్పీహెచ్ఎస్ సూరిపల్లి, రెండో స్థానం జెడ్పీహెచ్ఎస్ మల్లంపల్లి జట్లు నిలిచాయి. విజేతలకు అదనపు కలెక్టర్ బహుమతులు అందజేశారు. జిల్లా సంక్షేమ అధికారి శారద, డీవైఎస్‌ఓ సత్యవాణి, సీడీపీఓ విశ్వజ, ఉమెన్స్ హబ్ కో ఆర్డినేటర్ పావని, ఎస్‌జీఎఫ్ఐ బి.వెంకన్న, ఎం వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, రఘువీర్, కోచ్‌లు, పాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.